# నిండుమనసు

కె. వస్య



ప్రేమ-పురుషుడి జీవితంలో ఒక భాగం.

ప్రేమ-స్త్రీకి జీవన సర్వస్వం.

* * *

బయటంతా ఎండ చండప్రచండంగా దంచేస్తున్న ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకి గదిలో అద్దం ముందు నిల్చుని ముస్తాబుకి ఆఖరు మెరుగులు దిద్దుకుంటున్నాడు శంభు.

రాక్‌లో పెట్టిన టైంపీస్ అద్దంలో కనిపిస్తోంది. అందులో చిన్నముల్లు రెండుకూ మూడుకూ సరిగ్గా మధ్యనే ఉంది. పెద్దముల్లు మాత్రం మెల్ల మెల్లగా ఆరుదాటి కదిలిపోతుంది.

కంటికి స్పష్టంగా కనిపించకున్నా, ఆ టైంపీస్‌లోని పెద్దముల్లు కదలికను అద్దంలో ప్రతిబింబంలో కూడా గుర్తించ గలుగుతున్నాడు శంభు.

ఇంక ఇరవై ఏడు నిమిషాలే ఉన్నాయి —రేఖను చేరుకోవటానికి. గది తాళం వేయ్యాలి, మెట్లు దిగాలి, రోడ్డెక్కాలి, టౌనుబస్ పట్టుకోవాలి. (బస్ దొరక్కుంటే రిక్షా! కాని, వాడు ముక్కీ-మూలిగీ ఎప్పటికి తొక్కుతాడు?), ఎలాగైనా యూనివర్శిటీ చేరాలి, లేడీస్ హాస్టల్‌దాకా నడవాలి!

రిస్ట్‌వాచ్‌కేసి చూసున్నాడు శంభు. ఇరవై ఆరు నిమిషాలే ఉన్నాయి!

టైంపీస్‌కూ రిస్ట్‌వాచీకీ ఉన్న తేడా ఎంత? నిమిషమున్నదా? రేఖ వాచీకీ తన వాచీకీ ఎంత తేడా ఉంటుంది.

ఊహించే వ్యవధికూడా లేదు.

కాలం మహావేగంతో తిరిగిపోతోంది. ఇరవై ఆరు నిమిషాల సల్పవ్యవధిలో శంభు, రేఖను కలుసుకోవాలి!

క్రాఫ్‌ను ఆఖరుసారిగా కాస్త దువ్వి, సరిచూసుకుని-మళ్ళీ వాచీలోకి చూసుకుని ఉలిక్కిపడ్డాడు శంభు. ఇరవై అయిదు నిమిషాలు! చూస్తుండగానే, గదిలో ఉండగానే- అయిదు నిమిషాలు గడిచి పోయాయి!

చప్పున చెప్పుల్లో కాళ్ళు దూర్చి తలుపులు మూసి తాళం పెడుతున్నాడు.

"సార్!" అన్నాడు, అప్పుడే మేడ మెట్లెక్కి వచ్చిన పదహారేళ్ళ కుర్రాడు. మేడకింది వాటాలో వీధిలోకి ఉన్న ఫాన్సీ షాప్‌లో పనిచేస్తుంటాడు వాడు.

"ఏంటి?" అన్నాడు శంభు, వాణ్ణి గమనించీ, పట్టించుకోకుండా.

"ఫోనొచ్చింది సార్ మీకు...."

"నేను బయలుదేరుతున్నా- పద.... ఫోన్- ఎక్కడనుంచి?...."

"నేను తీలేదు సార్...."

షాప్ మేనేజర్ తీసుంటాడు.

బ్యాంక్‌లో పనిచేస్తున్నాడూ, బుద్ధిమంతుడూ అని శంభు అంటే షాపు వాళ్ళకి అభిమానం.

దగ్గరి మిత్రులకూ- ఆత్మీయులకూ ఫాన్సీషాప్ ఫోన్ నంబర్ ఇస్తుంటాడు శంభు.

ఫోన్ వచ్చినపుడు షాపువాళ్ళు శ్రమ అనుకోకుండా కబురుపెడుతుంటారు.

మెట్లు దిగుతూ మళ్ళీ వాచీ చూసుకున్నాడు శంభు. రెండూ ముప్పైఆరు. మరో నిమిషం గడిచిపోయింది. ఫోన్ సంభాషణకి అధమపక్షం ఇంకో నిమిషం కావాలి.

తనకు అలవాటుగా ఫోన్‌చేసే మిత్రుల్ని గుర్తుచేసుకున్నాడు. ఈ టైములో తనతో మాట్లాడదలిచే వారెవరో మాత్రం అంతుపట్టలేదు.

లేటైతే విసుగ్గా వాచీలోకి చూసుకుంటూ కళ్ళలో శూన్యాన్ని నింపుకునే రేఖ రూపం ఊహగా మెదిలింది.

చప్పున షాప్‌లోకి ఒక్క గెంతు గెంతి, కౌంటర్‌మీద ఉంచిన రిసీవర్ అందుకున్నాడు. "హలో!...."

"నేను- రేఖని! ఇంతసేపేంటి- మేడ దిగి రావటం?"

"నువ్వని తెలిస్తే మేడ దూకే వద్దును. తెలీలేదు."

ఫోన్‌లో రేఖ గొంతు వినేసరికి, ఆ ఎండవేడి అంతటిలోంచీ చల్లటి వెన్నెల

గాలి పోకినట్లయింది. "రేఖా! హాస్టల్ నుంచేనా మాట్లాడుత? ఎలాగూ వచ్చేస్తున్నాగా!...."

"బయలుదేరబోతున్నావా?...."

"బయలుదేరే ఉన్నాను.- అవునూ- ఈలోగా ఈ ఫోనేంటి?...."

"నువ్విప్పుడు రావొద్దు!"

"వ్వాట్?"

"సారీ శంభూ! అర్జెంటు పని పడింది."

"యు షుడ్బి జోకింగ్!"

"లేదు ప్లీజ్!.... ఇప్పుడు రాకు నువ్వు....సాయంత్రం ఆరుకి రా!...."

"వ్వాట్! ఇంపాసిబుల్! ఈ ఆదివారం కోసం ఎంతగా ఎదురుచూస్తున్నాం.... ఏం? ఫ్రెండ్స్‌తో మాట్నీయా?...."

"బాప్రే!.... ఎగతాళి కాదు శంభూ! సీరియస్‌గా చెప్తున్నా!.... ఇప్పుడు నే వెళ్ళాలి!.... నువ్వు సాయంత్రం సరిగ్గా ఆరుకి రా! ఐ విల్ బి వెయిటింగ్...."

"మరి నే నిప్పుడెల్లా? నీ కోసమై తయారయి బయలుదేరేశాను. పోనీ మీ హాస్టల్‌దాకా వచ్చి, ఒక్కసారి నిన్ను చూసి వచ్చేస్తాను. తర్వాత సాయంత్రం కలుసుకుందాంలే!...."

"డోంట్ బి సిల్లీ! మరో నిమిషంలో నేను బయలుదేరుతున్నాను. తయారయి ఉంటే ఏ మాట్నీకో వెళ్ళు...."

"ఇప్పుడదీ అందదు. ఈ సరికి రెండో రీలు పరుగెడుతుంటుంది...."

"అయితే లైబ్రరీ కెళ్ళు.... లేకుంటే శుభ్రంగా రూంలో పడుకుని నిద్రపో! మనం సాయంత్రం ఆరుకి కలుస్తున్నాం.... విషయం అంతా వచ్చాక చెప్తాను. ఓ కే? బై...."

ఫోన్ పెట్టేసిన చప్పుడు. రేఖ గొంతు తెగిపోయింది.

మెల్లమెల్లగా రిసీవర్ దించుతున్న శంభు చేతిలో ఒక్కసారి సత్తువంతా పోయినట్టనిపించింది.

ధగధగలాడే బయటి ఎండ అంతా ఒక్కసారిగా చిమ్మచీకటి అయినట్టు తోచింది.

పేలవమైపోయిన శంభు ముఖమంతా చెమటలు పోశాయి.

"ఏం సార్?" అన్నాడు షాప్ మేనేజర్, పలకరింపుగా.

"ఏం లేదు" అని కదిలి ఇవతలికొచ్చాడు శంభు.

మనసంతా శూన్యంగా పెద్దసున్నలా అయిపోయింది.

వెంటనే ఏంచెయ్యాలో తోచలేదు. రూముకి వెళ్ళిపోదామని మెడమెట్లకేసి రెండడుగులు వేశాడు. అంతలో మనసు మార్చుకుని వెనుదిరిగి రోడ్డు మీదికొచ్చేశాడు.

సాయంత్రం ఆరు! అప్పటిదాకా రేఖను కలుసుకోవటం వీలుపడదు.

గడియారంలోకి చూడాలని అనిపించటమే లేదిప్పుడు.

"ఏయ్ రిక్షా!" అని పిలిచాడు. ఎక్కికూచున్నాడు. సిమెంటు రోడ్డుమీద రిక్షా సర్రున సాగిపోతోంది.

ఈ సరికి యూనివర్సిటీ వైపు వెళ్తూ ఉండాల్సింది. రేఖకు ఇంత హఠాత్తుగా అర్జెంటు పనేమిటి? గెస్‌చేసి లాభంలేదు. ఇంక రేఖ చెప్పాల్సిందే! సాయంత్రం ఆరుకి!

రిక్షా జంక్షన్ చేరుకుంది. "డీలక్స్ హోటల్‌కి పోనీ" అన్నాడు.

మామూలుగా తీరికఉండే సాయంత్రాలు ఆ హోటల్‌లో చాయ్ చప్పరిస్తూ గడుపుతాడు శంభు. పరిచయస్థులు తారసపడితే పలకరిస్తాడు.

మధ్యాహ్నాలు 'డీలక్స్'కి వెళ్ళటం మాత్రం చాలా అరుదు. హోటల్‌కూడా ఖాళీగా ఉంటుంది. టేబుల్‌మీద ముసిరే ఈగలే కంపెనీ.

రిక్షాలోంచి వంగి సినిమా పోస్టర్స్ వైపు చూశాడు. ముందే తెలిసున్నా బాగుండేది. మాట్నీకి వెళ్ళిందేవాడు. లేదా, తీరికగా భోంచేసి రూములోనే కాసేపు పడుకుని ఉండేవాడు. తీరా తయారయాక ఇప్పుడు - సాయంత్రం ఆరుదాకా ఆగాలంటే తగని శూన్యంగా ఉంది.

సంవత్సరమున్నర క్రితం పరిచయం రేఖతో. పరిచయం- ప్రణయం- ఇక ప్రపోజల్‌లో పరిణయం!

"డిసెంబర్‌కి థీసిస్ రాయటం పూర్తయి పోతుంది. అలోగా పెళ్ళి అనే డిస్టర్బెన్స్ వొద్దు" అంది రేఖ.

రేఖ ప్లానింగ్‌మీద అతనికి నమ్మకం ఉంది.

ఇద్దరి వేపులనుంచీ ఆటే అభ్యంతరాలుండవు. ఉన్నా, పెళ్ళి తరువాత నెమ్మదిగా సర్దుకోవచ్చు.

ఈలోగా ఇద్దరూ కలుసుకుంటూనే ఉన్నారు. మనసు విప్పి మాట్లాడుకుంటున్నారు.

ఆదివారమంటే ఇద్దరికీ ఆటవిడుపు. ఆమెకు డిపార్టుమెంటు నుంచీ, అతనికి బ్యాంక్ నుంచీ.

డీలక్స్ ముందు రిక్షా ఆగింది.

శ్రమజీవి రిక్షావాడు, ఎండలో తళతళ మెరిసే చెమటను పైగుడ్డతో వొత్తుకుంటున్నాడు.

ముందుగా మాట్లాడుకున్న రూపాయిన్నర వాడి చేతిలోపెట్టి, 'నేనొక రిక్షావాడినై ఉంటే?' అని మెదలబోయిన ఊహను అక్కడే తెంచేసి హోటల్ మెట్లెక్కాడు శంభు.

అలవాటయిన కార్నర్ టేబుల్ దగ్గర కూచున్నాడు. ఫరవాలేదు. ఆదివారం కాబట్టి కాబోలు హోటల్‌లో చెదురుమదురుగా కస్టమర్స్ న్నారు, మధ్యాహ్నం అయినా.

కూచున్న చోటినుంచీ బైటకి చూస్తే- రోడ్డుమీద అప్పుడప్పుడూ కదులుతున్న వాహనాలు కనిపిస్తాయి.

'చా' చెప్పుకుని, అది రాగా చప్పరిస్తూ

కూచున్నాడు శంభు. చిరపరిచయస్థుడైన సర్వర్ పలకరింపుగా నవ్వాడు. శంభు కూడా బదులు నవ్వాడు గాని, ఆ నవ్వు తనకే పేలవంగా అనిపించింది.

క్లీనరు కుర్రాణ్ణి పిలిచి, వాడిచేత ప్యాకెట్టు సిగరెట్లు తెప్పించుకున్నాడు. శంభు సిగిరెట్లు మామూలుగా తక్కువగా కాలుస్తాడు 'సిగిరెట్లు త్రాగుట ఆరోగ్యానికి హానికరం' అనే అర్థం స్ఫురించేలా రేఖ హెచ్చరింపుగా చూసినప్పుడల్లా, 'పెళ్ళయ్యాక పూర్తిగా ఎలాగూ మానేస్తాగా!' అన్నట్టు నవ్వుతాడు.

కాని, ఈ మధ్యాహ్నం వేరు!

సిగిరెట్టు పొగమీదుగా యథాలాపంగా హోటల్ గడియారంవేపు చూశాడు. మూడూ పది!

ఇంకా రెండు గంటలా యాభై నిమిషాలు! ఎలా గడపటం?

సిగిరెట్టు తాగుతూ రోడ్డుమీదికి చూస్తున్నాడు శంభు.

పళ్ళబండి, వెర్రి బిచ్చగాడు, తారు రోడ్డుమీద ఎండ మెరుపు, లారీ హారన్, టెలిగ్రాఫ్ స్తంభం, బద్ధకంగా నడుస్తున్న ఎద్దు, కిళ్ళీబడ్డీ, వ్రేలాడుతున్న పత్రికలు, సినిమాతారల ముఖాలు, ఆటో శబ్దం—వికారంగా, ఎర్రచీర, గొడుగుతో నడివయసు మనిషి, సోడా కీచుమన్న శబ్దం, నీడలో ముసలిది, హోటల్ మెట్లెక్కుతూ పంజాబీ దంపతులు....

హోటల్ ఇంకా అలాగే ఉంది. నిస్తేజంగా, స్తబ్దుగా. సాయంత్రానికి ఇక్కడ సీటు దొరకటమే కష్టం. 'చా' పక్షులతో కిటకిటలాడిపోతుంటుంది.

—సిగిరెట్టు పీక కిందపడేసి, చెప్పుతో నలిపేశాడు. అసహనంగా ఉంది. ఏం చెయ్యాలి? వాచీలోకి చూసుకున్నాడు ఊరికే. టైమెంతో గమనించలేదు. జేరగిలబడ్డాడు.

మిని థియేటర్‌లో హిందీ సినిమా ఉండాలి. దానికి వెళ్ళుంటే బాగుండేది.

ఎవరో ఇద్దరొస్తున్నారు. వచ్చారు. సీలింగ్‌ఫ్యాను చూసుకుని సరిగ్గా శంభు టేబుల్ దగ్గరే కూచున్నారు— శంభు కెదురుగా.

ఒకడు లావుగా, నల్లగా చెమటలు కారుస్తున్నాడు. మరొకడు— లావుగా, ఎర్రగా— కర్చీఫ్‌తో మాటిమాటికీ ముఖం ఒత్తుకుంటున్నాడు. ఇద్దరూ 'చా'లు చెప్పుకుని— దేశరాజకీయాల గురించి చర్చించుకుంటున్నారు. ఒకరు చెప్పేది మరొకరు వినటంలేదు. ఎవరికి వారు మాట్లాడుకుంటున్నట్టే ఉంది. 'వీళ్ళు సినిమాల గురించో, క్రికెట్ గురించో, నల్లుల మందు గురించో మాట్లాడుకున్నా బాగుణ్ణు— కాస్సేపు వినొచ్చు!' అనుకున్నాడు శంభు. మళ్ళీ రోడ్డుమీదికి చూడబోయాడు. లాభంలేదు. లావుపాటి ఆకారాలు రెండూ భుజాలతో అడ్డం వస్తున్నాయి. వాళ్ళ భుజాలమీదుగా రోడ్డు మీదికి చూడటం— ఇబ్బందిగా ఉంది. సీటు మారి కూచోవచ్చు. ఇష్టంలేదు.

తప్పని సరయినట్టు లేచి, కౌంటర్లో ఇరవైపైసల బిల్లు చెల్లించి, బైట కొచ్చాడు శంభు.

మళ్ళీ అంతే. ఏంచెయ్యాలో తోచదు.

నడుస్తున్నాడు రోడ్డు వారగా. షాపుల్లో రద్దీలేదు. ఖాళీగా ఉన్నాయి. కౌంటర్లు ఈగలు తోలుకుంటున్నాయి.

జంక్షన్ చేరుకున్నాడు. టవర్ క్లాక్‌లో పెద్ద ముల్లు అప్పుడే ఆరు మీంచి కదులుతోంది. మూడున్నర. అంతే!

సన్నగా, పొడవుగా ఉన్నా— ఈ పెద్ద ముళ్ళకి ఇంత బద్ధకమేమిటి? లావుగా, పొట్టిగా ఉండే చిన్నముల్లు— ఆరు మీదికి రావటానికి ఇంకా— రెండున్నర గంటల కాలం పడుతుంది!

గడియారాల కాలంవేరు. హృదయాల కాలం వేరు. గడియారం—యంత్రం. క్రమంగా, లయగా కదులుతుంది. అంతా లెక్క. హృదయం—జీవి. అంతాఊహ. యంత్రానికి రెండున్నర గంటలు—రెండున్నర గంటలే! జీవి కాలం వేరు. కాలమానం వేరు. ఇప్పుడు హృదయానికి— ముందుండే రెండున్నర గంటలూ రెండున్నర యుగాలు! అంత కన్నా ఎక్కువే!

అడుగులో అడుగుగా నడుస్తున్నాడు శంభు రూము వేపు. అలవాటైన రోడ్డే కాని, దృష్టి నిలవదు. ఆలోచన నిలవదు. అంతా చెదురుమదురు.

సినిమా పోస్టర్లో— ఆంధ్రుల అభిమాన హీరోయిన్ వానచినుకుల్లో తడిచిన బట్టల్లో హీరో కౌగిట్లో ఉంది.

వొళ్ళంతా కసకసగా ఉంది శంభుకి. చెమట. మళ్ళీ రిక్షా ఎక్కాలని లేదు. మలుపులో చెట్టుమీద కాకులు శబ్దం చేస్తున్నాయి.

దిక్కుతోచని మధ్యాహ్నాలను గడపటానికి మ్యాట్నీలకు మించి సాధనాలు లేవు. రేఖనుంచి ఫోన్ ఇంకాస్త ముందే వచ్చి ఉంటే, మాట్నీకి వెళ్ళుండేవాడు.. ఈ బోరు తప్పిఉండేది.

నడుస్తూ సిగిరెట్టు వెలిగించాడు శంభు. ఎండకు తల చుర్రుమంటోంది. రెండు గుక్కలు పీల్చాక, నాలుక తడారిపోయి నట్టనిపించింది. వికారం. సిగిరెట్టు విసిరేశాడు. ముప్ఫై పైసల సిగిరెట్టు. దేశంలో దారిద్ర్యం ఉంది. దౌర్భాగ్యం ఉంది. శ్రమజీవులున్నారు. చెమట ఉంది. ఎక్కడెక్కడో ఎవరెవరో కారడవుల్లో కాల్పులకు గురవుతున్నారు. తనేం చేస్తున్నాడు?

కిళ్ళీబడ్డీ దగ్గర ఆగాడు. సోడా తాగాడు. బడ్డీలో టైంపీస్ ఉంది. దాని రెండు ముళ్ళూ పన్నెండు దగ్గర ఆగిపోయి ఉన్నాయి. యంత్రం— ఆగిపోతుంది. హృదయం— అప్పుడప్పుడు ఆగిపోయినట్టయిపోతుంది.

"టైమెంతయింది సార్?" అని

అడిగాడు బడ్డీవాడు. సోడాకి డబ్బిస్తూ "మూడు ముప్పావు" అన్నాడు శంభు వాచీ చూసుకోకుండానే. మూడు ముప్పావు అయిఉండదు. ఇప్పుడప్పుడే అవదు. కసిగా ఉంది.

కర్ర ఊత పొడుచుకుంటూ ముసలి బిచ్చగాడు ఎదురయాడు. "బాబూ.... దరమం...."

ముసలివాడివేపు విసుగ్గా చూసి విసురుగా ముందుకు కదిలాడు శంభు. ధర్మం లేదు, కాలానికే ఉన్నట్టులేదు.

నిస్సత్తువగా, నిర్లిప్తంగా మేడ మెట్లెక్కుతున్న శంభుకి శరీరమంతా ఒక బెండులా తేలిపోతున్నట్టనిపించింది తాళం తెరచి గదిలో కొస్తే- ఏదో రైల్వే గూడ్స్ వాగన్‌లో ప్రవేశించినట్టు తోచింది. షర్టుతీసి కుర్చీమీదికి గిరాటేసి, పక్కమీద వాలిపోయాడు.

దిండుమీద చెవి పెట్టేసరికి, గుండెల చప్పుడు లయబద్ధంగా వినిపించసాగింది. గుండె వేరూ- హృదయం వేరూ కదూ? గుండెకు లయ ఉంది.

ఓపిక తెచ్చుకుని ఫాన్ ఆన్‌చేసి మళ్ళీ పడుకున్నాడు. విశ్రాంతి తీసుకోవాలి. ఊఁహుఁ- లేదు. నిజానికి శరీరం అలిసిపోనేలేదు.

అటూ ఇటూ పొర్లాడు. దినపత్రిక అందుకున్నాడు. ఆదివారం అనుబంధంలో పెద్ద పెద్ద ఫొటోలున్నాయి. అడవిజాతి అనాగరికులు అమాయకంగా నవ్వుతున్నారు. ఆంధ్ర సాహిత్యం సొబగుల్ని వర్ణించే పెద్ద వ్యాసం ఉంది. అరటికాయతో ఏమేం వంటలు చెయ్యవచ్చో- స్త్రీలకోసం ప్రత్యేక వ్యాసం ఉంది. రిలీజు కాబోతున్న కొత్త సినిమా ప్రకటనలున్నాయి. అంతే, పేపరు విసిరేశాడు.

మరో సిగిరెట్టు వెలిగించాడు. పైకి లేవబోయిన పొగ ఫానుగాలివల్ల అణిగిపోయి, పక్కలకి చెదిరి పలచబడిపోతోంది. సురిగిపోతోంది.

గదిగోడలకేసీ, పైకప్పుకేసీ చూస్తున్నాడు. తెల్లటి గోడలేగాని, ప్రకాశవంతంగా లేవు. మూలల్లో బూజు చేరుతోంది. సాలెపురుగు చిన్నగా కదిలింది. కిటికీ బద్దీనుంచి బల్లి బద్ధకంగా కదిలింది.

గదంతా కలయజూశాడు. రెండు సూట్‌కేసులు, పుస్తకాలు, బట్టలు, టేబిలు, కుర్చీ, అంతే. రాత్రిచదవబోయి ఆపేసిన ఇంగ్లీషు నవల టేబిలుమీద ఉంది. పడుకునే చేయి సాచి నవల అందుకున్నాడు. ఎక్కడ ఆపాడో గుర్తులేదు. పేజీలు తిరగేశాడు. కొత్త పుస్తకం నుంచి అదోరకమైన వాసన వస్తుంది. ఏ పేజీలో ఆపాడు రాత్రి? పద్దెనిమిదా? ఇరవై ఎనిమిదా? పోనీ- కథ ఏ ఘట్టంలో ఆపాడు? ఏమీ గుర్తురావటం లేదు. చదవబోతే- సాగటంలేదు. వాక్యాలు- పదాలు- పదాలు- అక్షరాలు.... అంతే! ఒకదానికీ మరొకదానికీ పొంతన ఉన్నట్టే అనిపించటంలేదు. పుస్తకంమూసేశాడు. కవర్‌పేజీకేసి చూశాడు.

పక్కమేడ నుంచి గడియారం గంటలు వినిపించాయి. నాలుగు. పుస్తకం అవతల పడేశాడు.

మబ్బు నీడలు కదిలాయి. బైట ఎండ నిమిషంపాటు చల్లబడి మళ్ళీ దంచేస్తోంది. కాని, కాస్త కాస్త పలచబడుతోంది. వాటారుతోంది.

వేళ్ళు వేడెక్కుతున్నాయి. సిగరెట్టు పీకని గదిమూలకి విసిరేశాడు. టేబిలు మీదనుంచి ఆష్ట్రే అందుకునే ఓపికలేదు.

ఫాను తిరుగున్నా ఉక్కగా ఉంది.

లేచి, పాంటునుంచి లుంగీకి మారాడు. మళ్ళీ పడుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. నిద్రేమీ రావటంలేదు. అలసటగా కూడా లేదు. కడుపులో వెలితి, మధ్యాహ్నం తొందర తొందరగా భోంచేశాడు. రేఖ ముందుగా గనుక ఫోన్‌చేసి ఉంటే....

లాభంలేదు. ఇంకా గంటన్నర గడవాలి అధమపక్షం. ఐదున్నర అయినా అయితే-తను బయలుదేరవచ్చు. ఎలా గడుస్తుంది?


లేచి గదిలో అటూ ఇటూ పచార్లు చేశాడు. మాట్నీకి వెళ్ళుంటే ఈ సరికి ఇంటర్వెల్ గడిచి ఉండేది. లైబ్రరీకి వెళ్ళుంటే? ఊఁ హుఁ. ఇప్పుడసలు చదివే మూడ్ లేదు.

గదిలో కూచుని చేసే పనులు లేవా?

కుర్చీ- టేబుల్ దగ్గరగా జరుపుకుని కూచున్నాడు. నలుగురైదుగురు మిత్రుల నుంచీ వచ్చిన ఉత్తరాలున్నాయి. వాటికి జవాబులు రాయాలి. లెటర్ పాడ్ తీసుకుని పెన్ అందుకున్నాడు. సంబోధనతో ఆగిపోయింది, ప్రారంభించిన మొదటి ఉత్తరం. రావటంలేదు. కాయితం చించి ఉండచుట్టి అవతల పారేశాడు. పాడ్ పక్కకి నెట్టి, పెన్ మూసి పెట్టేశాడు.

రాక్స్‌లో పుస్తకాలన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. దుమ్ము పేరుకుని ఉన్నాయి. వాటిని దులిపి సర్దవచ్చు. పై రాక్‌లో పుస్తకాలు కదిలించి తీసి దులపటానికి ఉపక్రమించాడు. మొత్తం నాలుగు రాక్స్ ఉన్నాయి. ఒక వరస సర్దటానికిపదినిమిషాలుపట్టొచ్చు. అంటే అలా అంతా సర్దితే, నలభై నిమిషాలు గడుస్తాయి. పుస్తకాలు దులుపుతుండగానే ఒక్కసారిగా అదోలా అనిపించింది శంభుకు. ఆదివారం మధ్యాహ్నం గదిలో ఇలా తనొక్కడూ, పుస్తకాలు అందుకుని దుమ్ము దులిపి సర్దుతూ.... ఏంపని ఇది? ఇప్పుడు చెయ్యాల్సిన పని? తనకు పిచ్చిగాని పట్టలేదు గదా? తనెందుకు చెయ్యాలి ఇప్పుడీపని? ఒక యంత్రంలా....? ఆపేశాడు, ఆగిపోయాడు.

హఠాత్తుగా అనిపించింది శంభుకు. కాలంగాని ఆగిపోతుందా ఇప్పుడు



ఆగిపోతే ఎలా ఉంటుంది? ఎవ్వరూ ఏ పనీ చెయ్యకుండా, ఎవ్వరూ ఎక్కడికీ వెళ్ళకుండా, ఎవ్వరూ ఎవ్వర్నీ కలుసుకోకుండా.... కాలం ఆగిపోతుందేమో! ముందుండే గంటన్నరా గడవదేమో! ఆరుగంటలు అసలెప్పటికీ కాదేమో!....

వాచీ చేతినుంచి తీసి అనవసరంగా కీ ఇచ్చి- మళ్ళీ పెట్టుకున్నాడు. నాలుగు ఇరవై దాటుతోంది.

ఇక ఆపై ఆలోచించే శక్తీ, ఊహించే ఓపిక కూడా లేనట్టు డీలా పడిపోయాడు. అలాగే పక్కమీద వాలిపోయాడు. నిద్రగాని పడుతుందేమోనని కళ్ళు మూసుకున్నాడు. మగత కూడా లేదు. మెదడు తేటగా ఉంది. మళ్ళీ సిగిరెట్టు వెలిగించబోయి మానేశాడు. అంతలో అయిడియా వచ్చింది. బస్సుగాని, రిక్షాగాని ఎక్కకుండా యూనివర్శిటీదాకా నడిస్తే- అనుకున్నాడు. నడవటం ముప్పావు గంటయినా అవుతుంది. అలాగైనా గడుస్తుంది. చప్పున లేచి ముఖం కడుక్కొని మళ్ళీ తయారయాడు శంభు.

* * *

యూనివర్శిటీ కాంపస్ రోడ్లమీదే అటూ ఇటూ పచార్లు చేస్తూఉండి ఎలాగో క్షణాలనూ నిమిషాలను నెట్టి ఆరుకు ఇంకా పది నిమిషాలుండగానే లేడీస్ హాస్టల్‌కి వెళ్ళాడు శంభు.

అలవాటయిన శంభు ముఖాన్ని చూడగానే రేఖను పిలవటానికి లోపలికి వెళ్ళాడు వాచ్‌మన్.

క్షణంలో వచ్చింది రేఖ. నీటుగా ముస్తాబయి ఉంది. శంభును చూసిన ఆమె ముఖంమంతా నవ్వు అయిపోయింది. "నేను అయిదున్నరకే వచ్చేశాను- నువ్వింకా ఆరుదాకా రావుగదా అనుకుంటూ ఉన్నాను. పద- కాంటీన్‌కు వెళ్దాం...."

ఇద్దరూ నడుస్తున్నారు.

ఇప్పటికి శంభు మనసు కాస్త తేలిక పడింది. "ఇంతకీ ఎక్కడి కెళ్ళినట్టు నువ్వు? అని అడిగాడు.

"ఆఁ....ఏముందీ.... మా లేబరేటరీలో జెనరేటర్ సెట్ ఒకటుంది. ఎక్స్‌పెరిమెంట్స్ కోసంలే.... అది కాస్త పాడయింది. రేపు ప్రాక్టికల్సున్నాయి. మెకానిక్ దాన్ని బాగుచేస్తుంటే నేను చూస్తూ కూచోవాలి- అదీ పని. ప్రొఫెసర్ దాన్ని మాగైడ్‌కి అప్పజెప్పాడు. ఆదివారం లేబ్ అసిస్టెంట్స్ ఎవరూ రారు. మాగైడ్ నాకు అప్పజెప్పాడు, తప్పుతుందా?...."

"మూడు గంటలు అలా కూచున్నావా అయితే? బోరు కొట్టలా?...."

"చిన్నబోరు కాదు. ఆ మెకానిక్కూ వాడి అసిస్టెంటూ యమ సీరియస్ మనుషులు. మాటా పలుకూ లేకుండా పనిచేస్తూ ఉండిపోయారు. చూస్తూ ఉండగా నాకు హఠాత్తుగా పిచ్చిపట్టినట్టు అయిపోయింది. ఆ రిపేర్ ఎప్పటికీ ముగియదేమో అనిపించింది. పని ముగిసిందని మెకానిక్ చెప్పేసరికి- ఎంత రిలీఫో-"

"పాపం అంతసేపూ- పరమబోరు కదూ?"

"కాని బోరుకొట్టకుండా మధ్యలోనే ఒక మార్గం కనిపెట్టుకున్నాగా!...."

"ఏంటి?...."

"హాయిగా ఆలోచిస్తూ ఉండిపోయాను- నీ గురించి! గంటలెలా గడిచాయో తెలియనేలేదు...."

ఇద్దరూ కాంటీన్ మెట్లెక్కుతున్నారు.

"మరి- నువ్వేంచేశావు? నిద్రపోయావా? అలా లేదే?...."

"ఊఁ....హుఁ...." అన్నాడుశంభు. అన్యమనస్కంగా. "ఏమీ- చెయ్యలేదు." అంటూండగా అతని గొంతు కొద్దిగా బొంగురుపోయింది.

అతని మనసులో ఒక ప్రశ్న సుళ్ళు తిరిగింది. 'మరి అంతసేపూ నేనెందుకు రేఖ గురించి ఆలోచించలేదు?'